క్లుప్తంగా

స్వచ్ఛందంగా రోడ్లకు మరమ్మతులు


రోడ్డు వేసుకుంటున్న గ్రామస్తులు

పర్చూరు (చినగంజాం): పర్చూరు మండలం కొమర్నేనివారిపాలెంలో గ్రామస్తులు తమ రోడ్లను తామే స్వచ్ఛందంగా బాగు చేసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. పర్చూరు–చెరుకూరు ఆర్అండ్‌బీ రహదారిలో ఉన్న గుంతల సమస్యను గ్రామస్తులు అధికారులుకు పలు పర్యాయాలు విన్నవించుకున్నా పట్టించుకోక పోవడంతో గాంధీ జయంతి రోజున వారే స్వయంగా బాగు చేసుకునేందుకు రంగంలోకి దిగారు. రోడ్డు గుంతల పడి తరుచూ ప్రమాదాలు జరుగుతుండటంతో వారే సొంత నిధులు సేకరించి రోడ్లను బాగు చేసుకున్నారు. రోడ్లు గుంతల పడటంతో గ్రామ ప్రజలకు బాగా ఇబ్బందిగా ఉండటంతో తామే బాగు చేసుకున్నట్లు సర్పంచ్ మున్నంగి వెంకట సుబ్బయ్య తెలిపారు. ట్రాక్టర్‌లతో మట్టిని తెచ్చి గుంతలు పూడ్చినట్లు చెప్పారు. గ్రామస్తులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొని సహకరించారు.

అంజన్నకు ఘన పూజలు


ఆంజనేయ స్వామి

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన అద్దంకి మండలం సింగరకొండలోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారికి బుధవారం దశ సహస్ర కదలీఫలార్చన (పదివేల అరటిపండ్లతో) నిర్వహించారు. కార్యక్రమాన్ని భాద్రపద మాసంలోని ఉత్తర నక్షత్రం మహాలయ అమావాస్య సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. దానిలో భాగంగా ప్రాతఃకాల సుప్రభాతం గోపూజ బిందెతీర్థం అనంతరం స్వామి వారికి అభిషేకం అలంకరణ తదుపరి వేదపండితులు అర్చకులు ఉభయ దాతలు వేదస్వస్తి మంగళవాయిద్యాలతో చేపట్టారు. వేదపండితుల అర్చకులు ఉభయదాతలను భక్తులను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. క్షేత్రంలో దసరా నవరాత్రులు సందర్భంగా గురువారం నుంచి విజయ దశమి వరకు ప్రతిరోజూ ప్రత్యేక అలంకారాలు ప్రత్యేక పూజలు అనంతరం తీర్థప్రసాద వినియోగం జరుగుతుందని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు చెప్పారు.

నేటి నుంచి దసరా శరన్నవరాత్రులు


చీరాల ప్రత్యేక అలంకరణలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు (ఫైల్)


వేటపాలెం: బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వేటపాలెం: దసరా నవరాత్రోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక వేంకటేశ్వర స్వామి దేశస్థానం కమిటీ అధ్యక్షుడు పొగడదండ సుబ్బారావు, సెక్రటరీ అందె రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ సభ్యులు బుధవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 03 నుంచి 12వ తేదీ వరకు ఆలయంలో దసరా నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వ హించ నున్నట్లు తెలిపారు. 03న హంస వాహనంపై ఊరేగింపు, వనితా నీకు వందనం సాంఘిక నాటకం, 04న అమ్మవారికి కుంకుమ పూజ, 05న స్వామివారు గరుడవానంపై ఊరేగింపు, సాంఘిక నాటకం, 06న స్వామివారు సూర్యప్రభవాహనంపై ఊరేగింపు, భజనావలి, 07న స్వామి చంద్ర ప్రభ వాహనం పై ఊరేగింపు, రాత్రికి భీమ్లానాయక్ సాంఘిక నాటక ప్రదర్శన, 08న స్వామి వారు హనుమంత వాహనంపై ఊరేగింపు, రాత్రికి కోలాట ప్రదర్శన, 09న స్వామి శేషవాహనంపై ఊరేగింపు, రాత్రికి గర్జించిన సింహాలు సాంఘిక నాటక ప్రదర్శన, 10న స్వామి వారు అశ్వవాహనంపై ఊరేగింపు, డాన్స్ పోటీలు, 11న స్వామి కల్పవృక్ష వాహనంపై ఊరేగింపు, భజనావలి, 12న విజయ దశమి రోజున స్వామివారికి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. నవరాత్రోత్సవాల బ్రోచర్‌ను ఆలయ కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. సాయని లక్ష్మీనారాయణ, బాణాల ఉమామహేశ్వరరావు, సహకార్యదర్శి రంగిశెట్టి సాంబశివరావు, అందే శ్రీనివాసరావు, కోశాధికారి పొగడదండ వెంకట రమణ, పల్లక సత్యనారాయణ పాల్గొన్నారు.


శరన్నవరాత్రులకు ముస్తాబైన చెన్నుపల్లి సీతారామస్వామి ఆలయం

చీరాల అర్బన్: దసరా శరన్నవరాత్రులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. దసరా ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని చీరాల, పేరాలలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయాలతో పాటు, భావనాఋషి దేవాలయం, పేరాల శివాలయంలో, ఎంజీసీ మార్కెట్‌లోని అమ్మవారి దేవాలయం, శ్రీ కామాక్షి అమ్మవారి దేవాలయం తదితర దేవాలయాల్లో గురువారం నుంచి12వ తేదీ వరకు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవాలయాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. తొమ్మిది రోజులు పాటు ప్రతిరోజూ ప్రత్యేక అలంకరణ, కుంకుమార్చనలు, భజన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో అలంకారంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అద్దంకి రూరల్: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి అనుబంధ ఆలయమైన శ్రీ గాయత్రి పరమేశ్వరి అమ్మవారి దేవి శరన్నావరాత్రులు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవస్థాన ఏసీ యం. తిమ్మనాయుడు బుధవారం తెలిపారు. గురువారం నుంచి అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిస్తారన్నారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బల్లికురవ: దసరా శరన్నవరాత్రులకు మండలంలోని ఆలయాలు ముస్తాబు చేస్తున్నారు. చెన్నుపల్లి గ్రామంలోని పార్వతి సమేత పరుసవేదిశ్వరస్వామి, సీతారామస్వామి, కొండాయపాలెంలో గంగాపార్వతి సమేత నీల కంఠేశ్వరస్వామి, కొణిదెన భవాని సమేత శంకర స్వామి చిన అంబడిపూడి పార్వతి మల్లేశ్వరస్వామి, కొప్పెరపాడు శివాలయాల్లో అమ్మవార్లను గురువారం నుంచి 12వ తేదీ వరకు ప్రత్యేక అలంకరణ నిర్వహించనున్నారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆలయ కమిటీ, అర్చకులు కోరుతున్నారు.

పార్టీ కోసం కష్టపడి పనిచేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్

చీరాల: పార్టీ ఓటమి చెందిందని ఎవరూ దిగులు చెందవద్దని, ఆత్మవిశ్వాసంతో పార్టీని బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఆయన పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ఓటమి చెందిన తర్వాత కొందరు మౌనంగా ఉండటం సరికాదన్నారు. కొద్ది సంవత్సరాల్లోనే జెమిలి ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, సంవత్సరం ముందే ఎన్నికలు జరుగుతాయన్నారు. తాను కొందరు ప్రచారం చేస్తున్నట్లు ఏ పార్టీకో, మరో ప్రాంతానికి వెళుతున్నట్లు దుష్ప్రచారాన్ని చేస్తున్నారన్నారు. తాను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోనే ఉంటానని, చీరాల నుంచే పోటీ చేస్తానన్నారు. ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని తెలిపారు. కొందరు అవకాశాల కోసం వెళ్లిన వారు పోయినా ఫర్వాలేదని, మరికొందరు వెళ్లిన వారు వచ్చేందుకు సిద్ధంగానే ఉన్నారన్నారు. మున్సిపల్ ఎన్నికలు, స్థానిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సత్తా చాటాలన్నారు. వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు చూశారని, ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలిపారు. అందుకే వైఎస్సార్ సీపీని అంతా కలిసి బలోపేతం చేద్దామన్నారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మాజీ ఎంపీపీ జి. శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, నాయకులు ఆసాది అంకాలరెడ్డి, వేటపాలెం అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, వాసిమళ్ళ వాసు, శ్రీను, యాతం మేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

భావన్నారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు


పూజలకు సిద్ధమవుతున్న భూదేవి సమేత భావన్నారాయణ స్వామి

చినగంజాం: స్థానిక భూ సమేత భావన్నారాయణ స్వామి దేవాలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు 3వ తేదీ గురువారం నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం స్వామి, అమ్మవార్లను పెళ్లి కుమారుడు, కుమార్తెలను చేయుట, రాత్రికి అంకురారోపణ, 4వ తేదీ శుక్రవారం ధ్వజారోహణ, విశేష హోమం, రాత్రి శేషవాహనంపై గ్రామోత్సవం, కోలాటం ప్రదర్శన, 5వ తేదీ శనివారం విశేష పూజలు, విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రాత్రి హనుమద్వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, కోలాట ప్రదర్శన, 6వ తేదీ ఆదివారం ప్రత్యేక హోమం, పూజలు, సాయంత్రం గజవాహనంపై గ్రామోత్సవం, కోలాట ప్రదర్శన, రాత్రి ఎదుర్కోలు మరియు శ్రీవారి కళ్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు. 7వ తేదీ సోమవారం ఉదయం విశేష పూజలు, హోమాలు, శ్రీదేవి, భూదేవి సమేత స్వామి వారి గరుడోత్సవం, కోలాట ప్రదర్శన, సాయంత్రం రథోత్సవం, కోలాటం ప్రదర్శన ఉంటుంది. 8వ తేదీ మంగళవారం ఉదయం విశేష పూజలు, హోమాలు, వసంతోత్సవం, అశ్వ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం, కోలాటం ప్రదర్శన, మధ్యాహ్నం చక్రస్నానం, రాత్రి హనుమాన్ చాలీసా పారాయణ, ధ్వజావరోహణ, పూర్ణాహుతి, మౌనబలి, 9వ తేదీ బుధవారం ప్రత్యేక పూజలు, విశేష అలంకారాలు స్వామి వారికి పల్లకి ఉత్సవం, ఆలయ ప్రాంగణంలోని బాలాజీ గోశాల 15వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం, రాత్రి ఊంజల్ సేవ, ద్వాదశ ప్రదక్షిణలు, ఏకాంత సేవ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వలివేటి శివనారాయణ, వెంకట రామానుజం, విశ్వనాథ బాబు, గుద్దంటి పిచ్చయ్య తెలిపారు. భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

యూటీఎఫ్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష


సత్యాగ్రహ దీక్ష చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

చీరాల అర్బన్: మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం యూటీఎఫ్ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. దీక్షను యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి అడుగుల శ్రీనివాసరావు ప్రారంభించారు. ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉపాధ్యాయులు పొందే అన్ని సౌకర్యాలను మున్సిపల్ ఉపాధ్యాయులకు వర్తింప చేస్తూ జీవో నెం.84 ను 2022 జూన్ 24న విడుదల చేసిందన్నారు. అయితే నాటి నుంచి నేటి వరకు మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఇందుకు యూటీఎఫ్ రాష్ట్ర శాఖ దశల వారీగా పోరుబాటను ప్రకటించిందని తెలిపారు. పలువురు వక్తలు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్య అయిన పీఎఫ్ సౌకర్యాన్ని వెంటనే కల్పించాలని కోరారు. బదిలీలు, పదోన్నతులు షెడ్యూలు ప్రకటించాలని, మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలన్నారు. మున్సిపల్ పాఠశాలలో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ముందుగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి దీక్షను ప్రారంభించారు. యూటీఎఫ్ బాపట్ల జిల్లా కోశాధికారి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా సహాధ్యక్షుడు భిక్షాలుబాబు, రాష్ట్ర కౌన్సిలర్ పి.సురేష్, జిల్లా ఆడిట్ కమిటీ మెంబర్ బి.సీతారామరాజు, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, పట్టణ శాఖ యూటీఎఫ్ నాయకులు వెలుగొండరెడ్డి, రాజేష్, సీహెచ్ సుబ్బారెడ్డి, కె.సుశీల, విజయలక్ష్మి, సుకుమారి, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలి

చినగంజాం: అమ్మ పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటాలని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ అధికారి సుబ్బారావు అన్నారు. స్వచ్ఛతా దివస్ కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో మాకే నామ్ పర్ ఏక్ పేడ్ అమ్మ పేరుతో ఒక మొక్క అనే కార్యక్రమం నిర్వహించారు. స్వచ్ఛతా దివస్ గురించి వివరించారు. హెచ్‌ఎం డి.రత్నకుమారి, ఎస్. నరసింహారావు, శానం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ యూనియన్ అధ్యక్షునిగా నేతాజీ


ఇనగాల నేతాజీ

చీరాల: చీరాల ఫొటో గ్రాఫర్స్ యూనియన్ ఎన్నికలు బుధవారం స్థానిక పాపరాజు తోటలోని ఎస్‌జే రంగనాయకులు, బాపనమ్మ కళ్యాణ మండపంలో జరిగాయి. అధ్యక్ష అభ్యర్థులుగా చీరాల ప్రాంతానికి చెందిన సీనియర్ ఫొటో గ్రాఫర్లు ఇనగాల నేతాజీ, చింత రవికుమార్ ప్యానల్స్ పోటీలో నిలిచాయి. యూనియన్ అధ్యక్షుని ఎంపిక కోసం ఓటింగ్ ప్రక్రియ ఏర్పాటు చేయగా చీరాల పరిసర ప్రాంతాల్లోని యూనియన్ సభ్యులు 270 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 85 మంది చింత రవికుమార్‌కు 186 మంది ఇనగాల నేతాజీకి ఓటు వేశారు. దీంతో ఇనగాల నేతాజీ 101 ఓట్ల మెజార్టీతో యూనియన్ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు.

గాంధీజీ ఆశయాలు కొనసాగిద్దాం


మున్సిపల్ కార్యాలయంలోని గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కరణం వెంకటేష్


చీరాల ఎంజీసీ మార్కెట్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుధ


మార్టూరు: వలపర్లలో గాంధీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు


యద్దనపూడి: పూనూరులో బాపూజీకి నివాళర్పిస్తున్న ఆర్యవైశ్య ప్రముఖులు

వేటపాలెం: మండల పరిధిలో వివిధ ప్రాంతాల్లో మహాత్మా గాంధీ 155 వ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. సారస్వత నికేతనం గ్రంథాలయంలో గల ఆయ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో ..

స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకట సుబ్బారావు పూల మాలవేసి ఘనంగా నివాళులప్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

వృద్ధులకు పండ్లు, పాలు పంపిణీ

దేశాయిపేట లోని అనాథ వృద్ధ శరణాలయంలో పందిళ్ళపల్లికి చెందిన శాంతినికేతన్ మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి సుశీలాదేవి ఆధ్వర్యంలో పండ్లు, పాలు, స్వీట్లు పంచిపెట్టారు. జెడ్పీటీసీ సభ్యురాలు బండ్ల తిరుమలాదేవి, శ్రీరాం బండ్ల వెంకటేశ్వర్లు, అనాథ వృద్ధశరణాలయం కార్యదర్శి సత్రం మల్లేశ్వరరావు, అధ్యక్షుడు గుత్తి విశ్వేశ్వరరావు, శ్రీవల్లి, కరణం మురళీ, శేఖర్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పర్చూరులో గాంధీకి ఘన నివాళి

పర్చూరు (చినగంజాం): జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కొట్ల బజారులో ఉన్న బాపూజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘ రాష్ట్ర నాయకుడు మామిడిపాక హరిప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ దేశానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగించాలని యువతకు పిలుపునిచ్చారు. యద్దనపూడి హరిప్రసాద్, కొల్లా శివరామకృష్ణ, శీరాం వెంకట సుబ్బారావు, షేక్ గౌస్ బాషా, పేర్ని హరి, ఎస్‌కే గౌస్, సిద్దయ్య పాల్గొన్నారు.

మార్టూరు: గాంధీ జయంతి వేడుకలను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. వలపర్ల పాఠశాల విద్యార్థులు గ్రామం సెంటర్లో ఉన్న గాంధీజీ విగ్రహం వద్దకు ప్రదర్శనగా బయల్దేరి పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. మార్టూరు ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్యవైశ్య భవన్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఉద్యోగులు, విశ్రాంతి ఉద్యోగుల ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాగరాజుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక వెంకయ్య ఆశ్రమంలో మైనార్టీ నాయకుడు గడ్డం మస్తాన్వలి గాంధీ జయంతి సందర్భంగా వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.

ఇంకొల్లు (చినగంజాం): జాతిపిత మహాత్మాగాంధీ, భారత దేశ రెండో ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను మండలంలోని ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల సిబ్బంది బండారు అనిల్ కుమార్, గోబిదేశి ఆదినారాయణ, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

యద్దనపూడి: సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింస అనే ఆయుధంతో గడగడలాడించిన పూజ్యబాపూజీ జయంతి వేడుకలను మండలంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని పూనూరు గ్రామ సెంటర్‌లో ఉన్న బాపూజీ విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుర్రం హనుమంతురావు, చెక్కా శ్రీనివాసరావు, మాదాల వెంకటస్వామి, కొనగండ్ల నాగమల్లేశ్వరరావు, పోలిశెట్టి వాసుబాబు, పసుమర్తి వెంకటేశ్వర్లు, కాకరపర్తి వెంకటకోటయ్య పాల్గొన్నారు. యనమదల, యద్దనపూడి గ్రామంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ అధ్యక్షుడు దారా బాలసుబ్బారావు, నున్నా రామచంద్రారావు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గం అనుసరణీయం

చీరాల రూరల్: ప్రతి ఒక్కరూ హింసా మార్గాన్ని విడనాడి అహింసా మార్గంలో పయనించి గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో నడవాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం. సుధ అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక మహాత్మా గాంధీ క్లాత్ మార్కెట్‌లో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. చంద్రశేఖర్, బార్ జి. రమేష్‌బాబు, ఎ. రామకృష్ణారెడ్డి సభ్యులు పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

చీరాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఎన్ఆర్అండ్‌పీఎం మాదల చిన సుబ్బారావు సహకారంతో రోటరీ కమ్యూనిటీ హాలులో 70 పైబడిన 15 మంది వాకర్స్‌ను సత్కరించారు. పోలుదాసు రామకృష్ణ, సెక్రటరీ చారుగుళ్ల గురుప్రసాద్, జి. సుధాకర్, బి. హేమంత్‌కుమార్, డాక్టర్ ఐ. బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చీరాల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు జరిగాయి. గాంధీ మార్గం అందరికీ ఆదర్శమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. అహింసతోనే అన్ని సాధించవచ్చని చేసి చూపించిన మహనీయుడు గాంధీజీ అన్నారు. అనంతరం స్థానిక తెల్లగాంధీ, నల్లగాంధీ బొమ్మలకు పూలమాలలు వేశారు. అలానే మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్‌చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, మాజీ ఎంపీపీ జి.శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కీర్తి వెంకట్రావు, బత్తుల అనిల్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ, పార్టీ చీరాల రూరల్ అధ్యక్షుడు ఆసాది అంకాలరెడ్డి, వేటపాలెం మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ కబీర్, వాసిమళ్ళ వాసు, శ్రీను, యాతం మేరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అలాగే టీడీపీ అధికార ప్రతినిధి ఎం.మహేంద్ర, కౌన్సిలర్ చుక్కా నాగలక్ష్మి, పి.సుబ్బయ్య, ఎస్.సత్యానందం, పార్టీ పట్టణ అధ్యక్షులు గజవల్లి శ్రీనివాసరావు తదితరులు నివాళులర్పించారు.

అద్దంకి రూరల్: రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక కొత్తపేటలోని గాంధీజీ విగ్రహానికి క్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. షేక్ మహమ్మద్ రఫీ, మలాది శ్రీనివాసరావు, జ్యోతి చంద్రమౌళి, దేవపాలన గాదేపల్లి దివాకరదత్తు, పీఎల్ఎన్ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: తిమ్మాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి. గంగాధర్ గాంధీజీ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. పీడీ మాస్టర్ కె. సుబ్బారావు, హిందీ నాగేశ్వరరావు, కాశింబి, తెలుగు ఉపాధ్యాయుడు పిచ్చయ్య, విద్యా కమిటీ చైర్‌పర్సన్ వెంకట రావు, చిరంజీవి పాల్గొన్నారు.

ఎల్ఐసీ బ్రాంచ్‌లో..

ఎల్ఐసీ బ్రాంచ్‌లో గాంధీజీ , లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళి అర్పించారు. దాసరి వెంకట సుబ్బారావు, షేక్ ఖాదర్ మస్తాన్, టీవీఎస్ శ్రీనివాస్, దుడ్డు మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

జె.పంగులూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేళ్ల నాగమ్మ, జెడ్పీటీసీ సభ్యులు రాయిణి ప్రమీల, పంగులూరు గ్రామ సర్పంచ్ గుడిపూడి నాగేంద్రం, ఎంపీపీ తేళ్ళ నాగమ్మ.. గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. మండల ఉపాధ్యక్షుడు యర్రం శ్రీనివాసరెడ్డి, రాయిణి వెంకటసుబ్బారావు, ఖాశీం, రామారావు పాల్గొన్నారు.

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు శాఖ గ్రంథాలయంలో బుధవారం మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథ పాలకుడు బాదం జయభాస్కర్ రెడ్డి గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

చినగంజాం: వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో గాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. విగ్రహ దాత చలువాది బదరీ నారాయణ, క్లబ్ గవర్నర్ పేర్ల సత్యనారాయణ విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల హెచ్‌ఎం డి.రత్నకుమారి, పాఠశాల సిబ్బంది అంగీకారం మేరకు పాఠశాల ఆవరణలో విగ్రహాన్ని ఏర్పాటు చేసినట్లు క్లబ్ అధ్యక్షురాలు సుచిత్ర తెలిపారు. క్లబ్ కార్యదర్శి బయ్యా జ్యోతి, కోశాధికారి మోటుమర్రి శివకుమారి, జోన్ చైర్మన్ పొట్టి శైలజ, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు శివరామకృష్ణ, బాపట్ల ఆర్యవైశ్య సంఘ జిల్లా అదనపు కార్యదర్శి మోటుమర్రి రామసుబ్బారావు, అమరా శ్రీనివాసరావు, గ్రామ ఆర్యవైశ్య సంఘం ప్రముఖులు పాల్గొన్నారు.

చీరాల అర్బన్: పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో బుధవారం మహాత్మా గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను నిర్వహించారు. స్వచ్ఛభారత్ సందర్భంగా గ్రంథాలయంలోని పుస్తకాల ర్యాకులు శుభ్రం చేశారు. గ్రంథ పాలకురాలు డి.ధనమ్మ, పాఠకులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహావిష్కరణకు హాజరైన ఆర్యవైశ్య ప్రముఖులు


వేటపాలెం గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తిరుమలాదేవి


పర్చూరు: కొట్లబజారులో గాంధీ జయంతి నిర్వహిస్తున్న నాయకులు


అద్దంకిలో నూతన వస్త్రాలు అందజేస్తున్న క్లబ్ అధ్యక్షుడు, సభ్యులు

ఆటోను ఢీకొన్న లారీ


జాతీయ రహదారిపై ఆటోను ఢీకొన్న లారీ

మార్టూరు: స్థానిక జాతీయ రహదారిపై ఇసుక దర్శి ఫ్లయి ఓవర్ వద్ద ఆటోను లారీ ఢీకొన్న సంఘటన బుధవారం ఉదయం జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది రవి, అశోక్‌ల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా కారంపూడి మండలం చిన్న గార్లపూడి గ్రామానికి చెందిన ఊటుకూరు రవి తన ఆటోలో గులాబీ మొక్కలు తీసుకొని కొత్తపట్నం వెళ్తున్నాడు. ఇసుక దర్శి డౌన్లో ఆటో టైర్ పంక్చర్ కావడంతో ఆటోను పక్కన ఆపుకొని పరిశీలిస్తున్నాడు. ఈ క్రమంలో అదే మార్గంలో విజయవాడ నుంచి తమిళనాడు వెళ్తున్న లారీ డ్రైవర్ శివకుమార్ ముందున్న ఆటోను బలంగా ఢీకొట్టాడు. అప్పటికే ఆటో డ్రైవర్ రవి కిందకు దిగి ఉండటంతో ఎలాంటి ప్రమాదం జరగకపోగా ఆటోలోని గులాబీ మొక్కలు మొత్తం రోడ్డు పాలయ్యాయి. సమాచారం అందుకున్న హైవే పెట్రోలింగ్ సిబ్బంది రవి, అశోక్ ప్రమాద స్థలానికి చేరుకొని ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు




మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యద్దనపూడి: ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం బాటిళ్లను తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రత్నకుమారి తెలిపారు. యనమదలలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నరసరావుపేట పట్టణానికి చెందిన పల్లపు గిరిధర్‌మణికంఠ అనే వ్యక్తి వాహనంలో 14 మద్యం సీసాలను తరలిస్తుండగా సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టెట్ నమూనా పరీక్ష విజయవంతం

చీరాల అర్బన్: నమూనా పరీక్షల ద్వారా తమ అభ్యాసనాన్ని ఉద్యోగార్థులు మరింత మెరుగుపరుచుకోవచ్చని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు అన్నారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నేతాజీ సేవా సమితి ఆధ్వర్యంలో తేలప్రోలు వీరయ్య, వెంకాయమ్మ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఉచిత టెట్ నమూనా పరీక్షను నిర్వహించారు. సైకాలజిస్ట్ మల్యాద్రిరెడ్డి, చుండూరి కృష్ణమూర్తి, పవని భానుచంద్రమూర్తి, కనపర్తి రామారావు, తాటికొండ రంగనాయకులు గుప్త, కొత్త వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మహనీయులకు అవమానం


కేవీ పాలెంలో పక్కన ఉంచిన విగ్రహాలు

బల్లికురవ: జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను బుధవారం బల్లికురవ మండలంలో మమ అనిపించారు. కాగా మండలంలోని కొమ్మినేని వారి పాలెం గ్రామ కూడలిలో ఐదు దశాబ్దాల క్రితం జాతిపిత మహాత్మా గాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. తర్వాత గ్రామ పంచాయతీ భవన నిర్మాణంలో భాగంగా ఈ విగ్రహాలను సచివాలయం ఎదురుగా పడవేశారు. దీంతో సచివాలయానికి వివిధ పనులపై వచ్చేవారు, మండల స్థాయి అధికారులు విగ్రహాలను చూసి అయ్యో పాపం అంటున్నారే తప్ప ఎలాంటి చర్యలు లేవు. ఇప్పటికైనా విగ్రహాల అమర్చాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.